

# జూన్ 14న గద్దర్ సినిమా అవార్డుల వేడుక

గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులను జూన్ 14న ప్రదానం చేయనున్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ఘనంగా నిర్వహించే వేడుకలో అవార్డులను అందజేస్తామన్నారు. ఈ వివరాలను తెలియజేసేందుకు మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, గద్దర్ అవార్డుల జ్యూరీ ఛైర్మన్ నటి జయసుధ పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ' ఈ ఏడాది నుంచి ఈ బృహత్తర కార్యక్రమానికి మళ్లీ శ్రీకారం చుట్టాం. ఇక నుంచి ప్రతి ఏడాదీ ఉత్తమ చలనచిత్రాలకు.. వివిధ కేటగిరీలలో ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రభుత్వ అవార్డులను అందిస్తాం. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల పట్ల ప్రభుత్వానికి ఓ స్పష్టమైన విధానం ఉంది. ప్రతి ఒక్కరూ ఈ అవార్డుల గురించి మాట్లాడుకునేలా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా ఉండేలా.. కనీవినీ ఎరుగని రీతిలో ఈ వేడుకను నిర్వహిస్తాం' అని తెలిపారు. గద్దర్ పేరిట ఇస్తున్న ఈ అవార్డులపై ఎన్ని విమర్శలు వచ్చినా, ఆయన పేరుతోనే అవార్డులు ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి పేర్కొన్నారు. 2024లో సెన్సార్‌బోర్డ్ సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు అవార్డులను అందించడానికి ఈ నెలలో దరఖాస్తులను కోరారు. దాంతో వివిధ విభాగాలకు గాను, దర్శక, నిర్మాతల నుంచి 76 దరఖాస్తులు, వ్యక్తిగత అవార్డుల విభాగాలకు గాను 1172 నామినేషన్లు రావడం జరిగింది. ఈ నామినేషన్లన్నింటినీ పరిశీలించి అవార్డులు ఇవ్వడానికి సినీ నటి జయసుధ అధ్యక్షతన 15మందితో కూడిన ఓ జ్యూరీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నెలరోజులూ ఈ సినిమాలన్నింటినీ తిలకించి, వాటిలో ఉత్తమ చిత్రాలను, అందులోని వివిధ కేటగిరీలలో ప్రతిభ కనబరచిన కళాకారులను జ్యూరీ అవార్డుల కోసం ఎంపిక చేయబోతున్నది.



# అదే నిజమైన విజయం!

సినిమాల ఎంపికలో చాలా సెలెక్టివ్‌గా ఉంటుంది అగ్ర కథానాయిక సాయిపల్లవి. ప్రస్తుతం హిందీలో 'రామాయణ' ప్రాజెక్ట్‌తో బిజీగా ఉంది. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సాయిపల్లవి సీతగా, రణబీర్‌కపూర్ రాముడిగా నటిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న తొలిభాగం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సాయిపల్లవి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'రామాయణ' సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందని చెప్పింది. పాత్రల ఎంపికలో తన ప్రాధాన్యతల గురించి చెబుతూ 'సినిమాను ఓకే చేసే ముందు కథలో ఎంతటి బలమైన భావోద్వేగాలు ఉన్నాయో ఆలోచిస్తా. అలాగే నా పాత్రతో ప్రేక్షకులు ఎంత వరకు కనెక్ట్ అవుతారోనని విశ్లేషిస్తా. నిజాయితీతో కూడిన వాస్తవిక కథలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తా. అన్నింటికంటే ముఖ్యంగా.. ప్రేక్షకులు నా పాత్రతో కనెక్ట్ కావాలని కోరుకుంటా. నా దృష్టిలో అదే అతిపెద్ద విజయం' అని సాయిపల్లవి పేర్కొంది.



# మంగళూరులో డ్రాగన్

ఎన్టీఆర్ 'డ్రాగన్' షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఇది నిజంగా ఆయన అభిమానులకు శుభవార్తే. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే షూటింగ్ మొదలైనా..అందులో ఎన్టీఆర్ లేని సన్నివేశాలను చిత్రీకరించారు. మంగళవారం కర్ణాటక మంగళూరులో మొదలైన తాజా షెడ్యూల్‌లో ఎన్టీఆర్ పాల్గొన్నారు. ఇక్కడ భారీ స్థాయిలో వేసిన పోర్ట్‌సెట్‌లో కీలకమైన యాక్షన్ ఎపిసోడ్స్‌ను తెరకెక్కిస్తున్నారు. వారం రోజుల పాటు ఈ షెడ్యూల్ జరుగుతుందని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రవిబస్రూర్ స్వరకర్త. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# జాతకం చూపిస్తే యాక్టర్ కావడం కష్టమన్నారు!

'ప్రస్తుతం కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు బాగా ఇష్టపడుతున్నారు. సామాన్యుడు విజేతగా నిలిచే కథలకు మంచి ఆదరణ లభిస్తున్నది. అందుకు పుష్ప, లక్కీ భాస్కర్ వంటి సినిమాలే నిదర్శనం' అన్నారు హీరో ప్రియదర్శి. ఇటీవలే 'కోర్ట్'తో సూపర్ సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ఆయన 'సారంగపాణి జాతకం' చిత్రంతో మరలా ప్రేక్షకుల్ని పలకరించబోతున్నారు. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం ప్రియదర్శి విలేకరులతో పంచుకున్న సంగతులు..



- జాతకాలను నమ్మాలా? లేదా? అనే విషయాలను ఈ సినిమాలో చర్చించడం లేదు. కానీ ఒకరి నమ్మకాల్ని మరొకరి మీద రుద్దితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూపిస్తున్నాం. జాతకాలను నేను కొంతవరకు నమ్ముతాను. కానీ వాటి గురించి పెద్దగా ఆలోచించను. ఇండస్ట్రీలో ఏదీ మన చేతిలో ఉండదు. ప్రయత్నం చేయడం వరకే మన పని.
- ప్రేక్షకులను నవ్వించడం చాలా కష్టమైన విషయం. ఇంద్రగంటి మోహనకృష్ణ కామెడీ టైమింగ్ బాగుంటుంది. ఇందులో నా పాత్రను చాలా కొత్తగా డిజైన్ చేశారు. ఇప్పటివరకు నేను ఎక్కువగా తెలంగాణ మాండలికంలోనే మాట్లాడాను. కానీ ఈ సినిమాలో ఆంధ్ర యాసలో మాట్లాడతాను. నా కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీ అన్నీ వైవిధ్యంగా ఉంటాయి.
- కామన్‌మేన్ పాత్రల్ని నేను బాగా ఇష్టపడతాను. నా సినిమాల సక్సెస్‌కు అదీ ఒక కారణం అనుకోవచ్చు. మల్లేశం, బలగం, కోర్ట్ వంటి సినిమాల కథలన్నీ మన చుట్టూ జరుగుతుంటాయి. అలాంటి సామాన్యుల కథల్లో తెలియని బాధ, ఉద్వేగాలుంటాయి. 'సారంగపాణి జాతకం'లో జాతకాలను నమ్మే వ్యక్తిగా నా పాత్ర హిలేరియస్‌గా సాగుతుంది.
- ప్రస్తుతం ఆడియెన్స్ ఫుల్ క్లారిటీతో ఉన్నారు. సినిమాలో విషయం ఉంటేనే థియేటర్లకు వస్తున్నారు. ఒకప్పుడు దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ గారితో ఓ ఫొటో దిగితే చాలనుకునేవాడిని. అలాంటిది ఆయన సినిమాలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా. శివలెంక కృష్ణప్రసాద్ గారు గొప్ప నిర్మాత. ఆ రోజుల్లోనే 'ఆదిత్య 369' వంటి సినిమాను నిర్మించారంటే ఆయన విజన్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు.
- ప్రస్తుతం ఏషియన్ సినిమాస్‌లో కొత్త దర్శకుడితో 'ప్రేమంటే' సినిమా చేస్తున్నా. గీతా ఆర్ట్స్‌లో బన్నీ వాసు నిర్మాతగా 'మిత్ర మండలి' అనే మరో సినిమా చేస్తున్నా. మరి కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. సామాన్యులకు రీచ్ అయ్యే బలమైన కథల్ని ఎంపిక చేసుకుంటూ కెరీర్‌లో ముందుకుసాగాలన్నది నా లక్ష్యం.

# తుపాకుల కంటే కత్తులనే ఎక్కువ వాడాం



తన తాజా చిత్రం 'హిట్ 3' ప్రమోషన్స్‌లో హీరో నాని బిజీబిజీగా ఉన్నారు. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని.. 'హిట్ 3' గురించే కాకుండా, సినిమాలపై వస్తున్న రివ్యూలపై కూడా స్పందించారు. 'ప్రస్తుతం ఎవ్వరినీ ఆపలేకపోతున్నాం. విమర్శలు శృతిమించుతున్నాయి. ఆడియన్స్ సినిమాపై ఒపీనియన్‌కి రాకముందే.. 'సినిమా ఫ్లాప్' అంటూ రివ్యూలో చేస్తున్నాయి. ఆ రివ్యూ రాసే వ్యక్తికి సినిమా నచ్చకపోవడం అతని వ్యక్తిగతం. అందరూ అతని మాట వినాల్సిన పనిలేదు. ఈ రివ్యూలు రాసేవాళ్లకు నేనొక్కటే చెబుతున్నా. పదిరోజులపాటు సినిమాను ఎవరూ చూడకపోతే అప్పుడు డిజాస్టర్ అని డిక్లేర్ చేయండి. అంతేకానీ జనాలు చూసేలోపే డిజాస్టర్ అనేసి సినిమాను చంపేయకండి' అంటూ ఉద్వేగంగా మాట్లాడారు నాని. 'హిట్ 3' గురించి చెబుతూ 'ఇందులో తుపాకుల కంటే కత్తులనే ఎక్కువ వాడాం. దానికి ఓ కారణం ఉంది. ఉద్దేశపూర్వకంగా పెట్టిన వైలెన్స్ కాదిది. దానికి కూడా ఓ బ్యాక్‌స్టోరీ ఉంది. ఇప్పటివరకూ 'అర్జున్' పేరుతో చాలా సినిమాల్లో నటించా. ఇందులో కూడా అర్జున్ సర్కార్‌గా నటించా. ఈ పేరు దర్శకుడి ఛాయిస్. 'హిట్ 3' తప్పకుండా అందరికీ నచ్చుతుంది. నా 'ప్యారడైజ్' సినిమా వచ్చే ఏడాది మార్చి 26న విడుదలవుతోంది. ఆ మరుసటి రోజునే రామ్‌చరణ్ 'పెద్ది' రిలీజ్ కానుంది. రెండూ బాగా ఆడాలని ఆశిస్తున్నా.' అని నాని అన్నారు.

# మహాభారతం నా ఆశయం



భారతీయ ఇతిహాసం మహాభారతాన్ని వెండితెర దృశ్యమానం చేయడమే తన ఆశయమని చెప్పారు అగ్ర నటుడు అమీర్ ఖాన్. ఈ డ్రీమ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనులకు ఈ ఏడాదిలోనే శ్రీకారం చుట్టబోతున్నానని ఆయన తెలిపారు. ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో మహాభారతం సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఇదొక సినిమా కాదని ఓ యజ్ఞం లాంటిదని అమీర్‌ఖాన్ అభిప్రాయపడ్డారు. 'మహాభారతం వంటి విస్తృత పరిధి ఉన్న కథను కేవలం ఒక్క సినిమాలో చూపించలేం. కొన్ని సిరీస్‌లుగా తెరకెక్కించాల్సి ఉంటుంది. హాలీవుడ్ లార్డ్ ఆఫ్ ది రింగ్స్ ట్రయాలజీ తరహాలో ప్రేక్షకులకు అందించాలి. దీని రచనకే రెండేళ్లకుపైగా సమయం పట్టొచ్చు. ఈ సినిమాలో నేను నటిస్తానా? ఏదైనా భాగానికి దర్శకత్వం వహిస్తానా? అనే విషయాల గురించి ఇప్పుడే మాట్లాడలేను. అయితే నా నిర్మాణంలోనే ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తా. నేటి తరానికి గొప్ప ఇతిహాసాన్ని అందించాలన్నదే నా కల' అని అమీర్‌ఖాన్ పేర్కొన్నారు. గత పదేళ్లుగా మహాభారత ప్రాజెక్ట్ గురించి అమీర్‌ఖాన్ పలు ఇంటర్వ్యూల్లో మాట్లాడారు. మహాభారత కథ ప్రతీ భారతీయుడి రక్తంలో ఉంది కాబట్టి ఎంతో బాధ్యతతో, అంకితభావంతో తెరకెక్కించాలని, అందుకు చాలా సమయం పడుతుందని ఆయన అన్నారు. దాదాపు 1000కోట్లకుపైగా వ్యయంతో అమీర్ ఖాన్ ఈ ప్రాజెక్ట్‌కు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

# కోలీవుడ్‌లో ఆ రికార్డ్ సూర్యాదే..



సీనియర్ తమిళ నటుడు శివకుమార్‌లో పుత్రోత్సాహం పెల్లుబికింది. ఇటీవల చెన్నైలో జరిగిన 'రెట్రో' సినిమా ఆడియో వేడుకలో తన తనయుడు, తమిళ అగ్ర హీరో సూర్య గురించి శివకుమార్ ఉద్వేగంగా మాట్లాడారు. 'నా కొడుకు అనే ముద్ర సూర్యపై ఎప్పుడూ లేదు. కెరీర్ ప్రారంభం నుంచి కష్టపడటం తప్ప తనకు మరొకటి తెలీదు. కోట్లాదిమందికి తను ఇష్టమైన నటుడు అయ్యాడంటే కారణం ఆ కష్టమే. కెరీర్ తొలినాళ్లలో నాన్‌స్టాప్‌గా నాలుగ్గంటలు డాన్స్ ప్రాక్టీస్ చేసేవాడు. తెల్లవారుజామున నాలుగంటలకే నిద్ర లేచి, బీచ్‌కి వెళ్లి స్టంట్స్ నేర్చుకునేవాడు. నిజాయితీగా ఓ విషయం చెబుతున్నా. కోలీవుడ్‌లో సిక్స్‌ప్యాక్ చేసిన తొలి హీరో నా కుమారుడు సూర్య. అప్పటివరకూ సిక్స్‌ప్యాక్ అంటే కూడా ఎవరికీ తెలీదు. నటుడిగా ఎన్నో గొప్ప పాత్రలు చేశాడు. ఒక తండ్రిగా సూర్య విషయంలో ప్రతిక్షణం గర్విస్తూనే ఉన్నా.' అన్నారు శివకుమార్. తండ్రి మాటలకు అక్కడే ఉన్న సూర్య భావోద్వేగానికి లోనయ్యారు.



# మోహన్‌లాల్ క్రైమ్ డ్రామా 'తుడరుమ్'

మోహన్‌లాల్, శోభన ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'తుడరుమ్'. తరుణ్‌మూర్తి దర్శకుడు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. దీపా ఆర్ట్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. మంగళవారం తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు క్రైమ్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ ఆకట్టుకుంది. ఇందులో మోహన్‌లాల్ ట్యాక్సీ డ్రైవర్‌గా కనిపించారు. ఆయన కారును పోలీసులు సీజ్ చేస్తారు? అందుకు కారణాలు తెలుసుకునే క్రమంలో ట్రైలర్ ఆద్యంతం ఇంట్రెస్టింగ్‌గా సాగింది. ఓ కారు, ఫ్యామిలీ చుట్టూ అల్లుకున్న కథ ఇదని అర్థమవుతున్నది. ఈ చిత్రానికి కథ: కేఆర్ సునీల్, సంగీతం: జేక్స్‌బిజోయ్, నిర్మాత: ఎం.రంజిత్, దర్శకత్వం: తరుణ్‌మూర్తి.

# ఏఐ చిత్రాలకూ ఆస్కార్!



ప్రపంచ సినిమాలో ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల ప్రదానం గురించి అకాడమీ కొత్త వివరాలను వెల్లడించింది. 2026 మార్చి 15న ఆస్కార్ పురస్కారాల వేడుకను జరుపబోతున్నట్లు పేర్కొంది. ఈసారి ఆస్కార్ అవార్డుల ఎంపికలో కొత్త నిబంధనలను ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. సినీరంగంలో పెరుగుతున్న సాంకేతికతను దృష్టిలో పెట్టుకొని ఏఐ ఆధారిత చిత్రాలను కూడా ఆస్కార్ అవార్డుల పరిశీలనకు తీసుకోనున్నట్లు తెలిపింది. 'ఆస్కార్‌లో పోటీపడనున్న చిత్రాల జాబితాను 2026 జనవరిలో ప్రకటిస్తాం. నామినేట్ చేసిన ప్రతీ చిత్రాన్ని అకాడమీ సభ్యులు తప్పకుండా వీక్షించేలా నిబంధనలను సవరించాం. అచీవ్‌మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కొత్త కేటగిరీని వచ్చే ఏడాది నుంచి ప్రవేశ పెడుతున్నాం. ఏఐ చిత్రాలను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ మామూలు చిత్రాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.' అని ఆస్కార్ కమిటీ ఓ ప్రకటనలో వెల్లడించింది. కొద్దిరోజుల క్రితమే ఆస్కార్ అవార్డుల్లో 'స్టంట్ డిజైన్' పేరిట కొత్త కేటగిరీని తీసుకొచ్చిన విషయం తెలిసిందే.


